క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి



పార్టీలో చేరిన వారితో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ముత్యాలనాయుడు, కన్నబాబు

రాంబిల్లి: వైఎస్సార్‌సీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి. రమణ మూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. దిమిలి గ్రామంలో టీడీపీకి చెందిన నగిరెడ్డి నానితో పాటు పలువురు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కన్నబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమణమూర్తి రాజు మాట్లాడుతూ, మే 13న జరిగే ఎన్నికల్లో విజయం కోసం కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ(తేజ) తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వర పాలేశ్వర స్వామి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

మునగపాక : మునగపాక పంచాయతీ వీధిలోని భీమేశ్వర పాలేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 23న ఆలయ ప్రాంగణంలో శివ పార్వతుల కల్యాణం ఘనంగా జరపనున్నారు. ఈ మేరకు శనివారం రాట మహోత్సవం జరిపారు. వేద పండితులు వెలవలపల్లి కోటేశ్వర శర్మ నేతృత్వంలో పూజలు చేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ



గంటవానిపాలెంలో ఐఆర్ఎస్ సర్వే చేస్తున్న అధికారులు

మునగపాక : మండలంలోని గంటవానిపాలెంలో శనివారం జిల్లా మలేరియా అధికారి దొర ఆధ్వర్యంలో దోమల నివారణకు సంబంధించి సర్వే చేపట్టారు. దోమల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేర్‌రాణి, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస రావు, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య, ఎంపీహెచ్‌ఏ ఎస్.అప్పలనాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలు



ఫేర్‌వెల్ డేలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాంబిల్లి : లాలంకోడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు చేసిన కోలాటం, నృత్యాలు అలరించాయి. చదువులోనూ, కరాటేలోను ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను హెచ్‌ఎం పీఆర్‌కే రాజు, ఉపాధ్యాయులు అందజేశారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

ఎస్.రాయవరం: నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ శనివారం తెలిపారు. తుని నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న ట్రాక్‌పై 65 ఏళ్ల వయసు గల వృద్ధుడు మృతి చెంది ఉన్నట్టు చెప్పారు. రైలు ఢీకొని మృత దేహం నుజ్జునుజ్జు అయిందన్నారు. ఎరుపు, నలుపు రంగు గల టీ షర్టు పడి ఉందని, మరే ఆధారాలు లభ్యం కాలేదన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తుని రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

అంబరమంత అభిమానం

- జగనన్నకు అఖండ స్వాగతం పలికిన ప్రజలు
- జనసంద్రమైన జాతీయ రహదారి
- నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో పండగ వాతావరణం



పులపర్తి హైవే వద్ద స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తున్న జననేత సీఎం జగన్



నక్కపల్లిలో కార్యకర్తలు, నాయకులు, మహిళలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

నక్కపల్లి: సీఎం జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్ర రోడ్‌షో శనివారం అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం గొడిచర్ల నుంచి ప్రారంభమయింది. దారి పొడవునా పార్టీ నాయకులు, కార్యకర్తలు అధినేతకు ఘనస్వాగతం పలికారు. గొడిచర్ల జంక్షన్‌లో మహిళలు, అభిమానులు హారతులిచ్చి స్వాగతం పలికారు. అక్కడి నుంచి బస్సుయాత్ర ఉద్దండపురం, వేంపాడు, చినదొడ్డిగల్లు, కాగిత, వెదుళ్లపాలెం మీదుగా నక్కపల్లి చేరుకుంది. చినదొడ్డిగల్లు జంక్షన్‌లో వందలాది మంది మహిళలు జగనన్నను చూసేందుకు రోడ్డుపైకి రావడంతో బస్సులో నుంచే జగన్ వారికి నమస్కరిస్తూ ముందుకు సాగారు. నక్కపల్లి గురుకుల పాఠశాల జంక్షన్ నుంచి ఉపమాక రోడ్డు వరకు కార్యకర్తలు, మహిళలు, యువతీ, యువకులు, అభిమానులు జగనన్నకు నీరాజనం పలికారు. ఎండకు ఇబ్బంది పడకుండా మహిళల కోసం పార్టీ కార్యాలయం వద్ద షామియానాలు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకే నక్కపల్లి మండలం నలుమూలల నుంచి వేలాదిగా తరలి వచ్చిన అభిమానులతో జాతీయ రహదారి కిక్కిరిసి పోయింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా అభిమానులు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. జగనన్నా.. పైకి రా అన్నా, నిన్ను చూసేందుకే వచ్చామన్నా.. ఎండ సైతం మాకు లెక్క కాదన్నా అంటూ నినాదాలు చేశారు. దీంతో జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, సిట్టింగ్ ఎమ్మెల్యే, ఎంపీ గొల్ల బాబూరావు, నక్కపల్లికి చెందిన సీనియర్ నాయకుడు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణతో కలిసి బస్సుపైకి ఎక్కి అభిమానులకు అభివాదం చేశారు. నక్కపల్లి జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న పెద్దపెద్ద భవంతులు, అపార్ట్‌మెంట్లపై ఎండను కూడా లెక్క చేయకుండా తన కోసం ఎదురు చూస్తున్న అందరికీ చేతులు జోడించి నమస్కరించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద మహిళలంతా హారతులివ్వడానికి ఒక్కసారిగా రావడంతో బస్సుపై నుంచే ఆలస్యమవుతోంది, ఎండ ఎక్కువగా ఉంది, మీ అందరూ ఇబ్బంది పడతారు అడ్డు తొలగండి అంటూ జగన్‌మోహన్‌రెడ్డి సైగ చేస్తూ సర్ది చెప్పి వారికి నమస్కరించి ముందుకు సాగారు. గొడిచర్ల నుంచి వందలాది బైక్‌లతో అభిమానులు జగనన్న కాన్వాయ్ వెంట అడ్డురోడ్డు వరకు వెళ్లారు. నక్కపల్లి మండల పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు కూడా మండల కేంద్రం నక్కపల్లి దాటే వరకు జగనన్న వెంట ర్యాలీగా వెళ్లారు. నక్కపల్లి నుంచి అడ్డురోడ్డు జంక్షన్‌కు చేరుకున్న బస్సుయాత్రకు అక్కడ ఎంపీపీ కోన లోవలక్ష్మి, మాజీఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి, జెడ్పీటీసీ కాకర దేవి ఆధ్వర్యంలో మహిళలు గుమ్మడి కాయలపై దీపాలు వెలిగించి దిష్టి తీస్తూ జగనన్న తమ ఆయుష్షు కూడా పోసుకుని నూరేళ్లు జీవించాలని దీవించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు బొలిశెట్టి శారదాకుమారిని జగనన్న బస్సులోకి పిలిపించుకుని మాట్లాడారు. జగనన్నకు స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షులు మణిరాజు, పాపారావు, తాతబాబు, జేసీఎస్ కన్వీనర్ సూరాకాసుల గోవిందు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గొర్ల గోవిందు, సింహాచలం దేవస్థానం ఆహ్వానితురాలు శేషారత్నం, సర్పంచ్‌లు సాదిరెడ్డి శ్రీను, వియ్యపు శ్రీను, సురేష్‌వర్మ, రత్నకుమారి, తళ్ల భార్గవ్, నర్సింహమూర్తి, ముసలయ్య, వెంకటేష్, రాజబాబు, అప్పలరాజు, ఎంపీటీసీలు తిరుపతిరావు, బచ్చలరాజు, నిట్ల గోవిందు, తోట సత్తిబాబు, సీనియర్ నాయకులు గొర్ల బాబూరావు, ఎల్లేటి సత్తిబాబు, తుమ్మా కల్పన, బంగార్రాజు, అల్లాడ కొండ, వీసం శ్రీను, ముద్దా శ్రీను, నల్లల రామకృష్ణ, బలరామరాజు, వేగేశ్న చంటి తదితరులు ఉన్నారు. ఇక అడ్డురోడ్డు జంక్షన్‌లో స్వాగతం పలికిన వారిలో మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందు, కొణతాల శ్రీను, మధు వర్మ, శ్రీపతిరాజు, మాతా గురునాథరావు, నూకినాయుడు, రాములరాజు, లోవరాజు తదితరులు ఉన్నారు.

అలవికాని అభిమానం..

నక్కపల్లిలో ఎండవేడిలో కూడా మహిళలు గుమ్మడి కాయలపై దీపాలు వెలిగించి జగనన్న చల్లగా ఉండాలంటూ దిష్టి తీశారు. యాత్ర పూర్తి చేసుకుని మళ్లీ సీఎంగా ఈ ప్రాంత పర్యటనకు రావాలని ఆశీర్వదించారు. పులపర్తి జంక్షన్‌లో పాయకరావుపేట సోషల్ మీడియా కో-కన్వీనర్ చేపల రాజు, కోటవురట్ల మండల కో-కన్వీనర్ గోపాలకృష్ణ మండుటెండలో మోకాళ్లపై కూర్చుని, బొర్లా పడుకుని జగనన్నకు రెండు చేతులు జోడించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.



అడ్డురోడ్డులో జగనన్నకు దిష్టి తీసేందుకు సిద్ధంగా ఉన్న మహిళలు



అడ్డురోడ్డులో జనసందోహానికి జగనన్న అభివాదం

సీఎం జగన్‌కు దిష్టి తీసిన మహిళలు..

ఎస్.రాయవరం: జననేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్రకు అడ్డురోడ్డు జంక్షన్‌లో మహిళలు పెద్ద ఎత్తున విచ్చేశారు. సీఎంకి దుష్టశక్తుల దిష్టి తగులుతోందంటూ హారతులతో దిష్టి తీశారు. మండలం నలుమూల నుంచి పెద్ద ఎత్తున చేరుకున్న అభిమానులతో 16వ నంబర్ జాతీయ రహదారికి కిక్కిరిసిపోయింది. అభిమానులకు సీఎం అభివాదం చేసి చిరునవ్వుతో పలకరించారు. బంగారమ్మ పాలెం నుంచి వచ్చిన మత్స్యకార మహిళా వీరాభిమాని గరికిన పద్మ సీఎం బస్సు వద్దకు కాన్వాయిని తోసుకుంటూ ముందుకు రావడంతో జగన్ బస్సులో నుంచి దిగి ఆమెను పలకరించారు. నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. అనంతరం గోకులపాడు, పి.ధర్మవరం గ్రామాల మీదుగా యలమంచిలి నియోజకవర్గానికి చేరుకున్నారు. సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, గాడి అప్పల నరసింహ, పాలపర్తి పాపారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దేపల్లి బొజ్జన్న, మల్లే లోవరాజు, కొరుప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ చేకూరి శ్రీరామచంద్రరాజు, చొప్పా రాజు, పోచిన నరేష్, గుర్రం నానాజీ, బొండా దివాణం, కోరెడ్డి సుబ్బారావు, కోరా జగదీష్, కొంగర రాజు, నాగంబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు కేసుబోయిన వెంకటలక్ష్మి, బొండా వెంకటలక్ష్మి, బాలం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిలో జన నీరాజనం..

యలమంచిలి రూరల్ : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు యలమంచిలి మండల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. శనివారం ఉదయం సుమారు 11.50 నిమిషాల సమయంలో పాయకరావుపేట నుంచి యలమంచిలి నియోజకవర్గంలోకి ప్రవేశించిన సీఎం జగన్‌కు అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ తదితరులు స్వాగతం పలికారు. పులపర్తి హైవే కూడలి వద్దకు బస్సుయాత్ర చేరుకునేసరికి పీఎస్ఆర్ పేట, ఏటికొప్పాక, బయ్యవరం గ్రామాల ప్రజలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు జై జగన్.. సీఎం.. సీఎం.. అంటూ నినాదాలు చేశారు. వారిని చూసి బస్సు దిగిన సీఎం ఆప్యాయంగా ప్రజలను పలకరించారు. ఆయనతో కరచాలనం చేసేందుకు యువకులు, విద్యార్థినులు, మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పోటీ పడ్డారు. అనంతరం లక్కవరం, పురుషోత్తపురం, పోతురెడ్డిపాలెం, రేగుపాలెం గ్రామాల హైవే జంక్షన్ వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో పాటు జగనన్న అభిమానులు మండుటెండని సైతం లెక్క చేయకుండా అభిమాన నేత కోసం ఆత్రుతగా ఎదురు చూశారు. యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, సీనియర్ నాయకులు సేనాపతిరాము, సిద్దా నూకేశ్వర్రావు తదితరుల బస్సు యాత్ర వెంట ఉన్నారు.

అన్నా.. మళ్లీ నువ్వే వస్తావ్..

ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా అన్నా మళ్లీ నువ్వే సీఎం అవడం ఖాయం అని పులపర్తి వద్ద మహిళలు, యువతులు బస్సు యాత్రలో భాగంగా అక్కడికొచ్చిన జననేతకు ఉత్సాహంగా చెప్పారు. దీనికి ప్రతిగా సీఎం వారికి ఆత్మీయ అభివాదం చేయగానే అక్కడున్న వారంతా సీఎం..సీఎం..అంటూ నినదించారు. ఈ సందర్భంగా తమ సమస్యలు చెప్పడానికి వచ్చిన వారిని సీఎం తన వద్దకు పిలిపించుకుని అక్కున చేర్చుకోవడం చూపరులను ఆకట్టుకుంది.



పులపర్తి వద్ద మోకాళ్లపై కూర్చుని జగనన్నకు జేజేలు పలుకుతున్న అభిమానులు

ఉమ్మలాడలో సీఎంకు బ్రహ్మరథం..

మునగపాక : మేమంతా సిద్ధం బస్సుయాత్ర మునగపాక మండలం ఉమ్మలాడ మీదుగా శనివారం రాత్రి సబ్బవరానికి చేరుకుంది. దారి పొడవునా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఉమ్మలాడ జంక్షన్ వద్ద బస్సులో నుంచి ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివాదం చేశారు. విశాఖ నుంచి వచ్చే వాహనాలను పూడిమడక రోడ్డు జంక్షన్ నుంచి మునగపాక మీదుగా అచ్యుతాపురం వైపునకు మళ్లించారు.



బంగారమ్మపాలెం మత్స్యకార మహిళ పద్మను ఆప్యాయంగా పలకరిస్తున్న సీఎం జగన్



సీఎం జగన్‌కు స్వాగతం పలికేందుకు నక్కపల్లి తరలి వచ్చిన అభిమానులు, పార్టీ శ్రేణులు

పాయకరావుపేటలో గెలవబోతున్నాం

- పార్టీ నాయకులతో సీఎం జగన్

నక్కపల్లి : పాయకరావుపేట నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మరోసారి విజయ ఢంకా మోగించనుందని, నాయకులంతా సమన్వయంతో పని చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. శనివారం సీఎంను గొడిచర్ల నైట్ స్టేపాయింట్ వద్ద పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేతలంతా కలిశారు. ఈ సందర్భంగా నాలుగు మండలాల్లో పార్టీ ఆవిర్భావం నుంచి కీలక పాత్ర పోషిస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, మాజీ ఎమ్మెల్సీ, ఎంఎస్ఎంఈ చైర్మన్ డీవీ సూర్యనారాయణరాజు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎస్.రాయవరం మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దత్తుడు సీతబాబు తదితరులను ద్దేశించి జగన్ మాట్లాడారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పటిష్టంగా ఉందన్నారు. జోగులును మీకు అప్పగిస్తున్నా, ఆయన గెలుపునకు కృషి చేయాలన్నారు. ముఖ్య నాయకులను సమన్వయం చేసుకుంటూ విజయావకాశాలు మెరుగు పరుచుకోవాలని కంబాల జోగులుకు సూచించారు. సీఎంను కలిసిన వారిలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆర్ఎస్ రామచంద్రరాజు, ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ, నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైలా రమేష్, జిల్లా పబ్లిక్ విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా తదితరులు ఉన్నారు.



కంబాల జోగులును గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తున్న సీఎం జగన్

కదిలిన జగనన్న సైన్యం



సీఎం జగన్ సభకు తరలి వెళ్లేందుకు సిద్ధమైన కైలాసపట్నం నాయకులు



గోకివాడ నుంచి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు



దిమిలి నుంచి బస్సులో వెళ్తున్న పార్టీ శ్రేణులు



నినాదాలు చేస్తున్న ఉమ్మలాడ పార్టీ నాయకులు

కోటవురట్ల : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు శనివారం తరలివెళ్లారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల నుంచి పెద్ద సంఖ్యలో అనకాపల్లి నియోజకవర్గం నర్సింగబిల్లికి తరలివెళ్లారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు.

రాంబిల్లి మండలం నుంచి..

రాంబిల్లి : సీఎం సభకు శనివారం రాంబిల్లి మండలం నుంచి ఎంపీపీ శిరీష శ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పిన్నం రాజు కిషోర్, నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ ఎస్‌పీ సూర్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, వైస్ ఎంపీపీ కొటాపు లక్ష్మి వడ్డికాసులు, దిమిలి పీఏసీఎస్ చైర్‌పర్సన్ సిరసపల్లి రామారావు, నాయకలు నగిరెడ్డి మురళీకృష్ణ, బంగారు చిలుకు, ద్వారపురెడ్డి గోవిందరావు తదితరులు తరలి వెళ్లారు.

ఉమ్మలాడ నుంచి..

మునగపాక : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు మునగపాక మండలం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. పార్టీ జెండాలను చేతబట్టి జై జగన్ నినాదాలతో ఉత్సాహంగా బస్సుల్లో కశింకోట మండలం చింతలపాలెం వద్ద శనివారం సాయంత్రం జరిగిన బహిరంగ సభకు తరలివెళ్లారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం తథ్యమని తద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని పార్టీ నేతలు సూరిశెట్టి రామకృష్ణ, శ్రీనివాసరావు, మందా రాము తదితరులు తెలిపారు.

పార్టీ శ్రేణులకు కంబాల జోగులు ధన్యవాదాలు

నక్కపల్లి : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్రను విజయవంతం చేసిన పాయకరావుపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు, కార్యకర్తలకు, అభిమానులకు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ధన్యవాదాలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో ఈనెల 22న జరగనున్న తన నామినేషన్ కార్యక్రమంలో కూడా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



ఎంపీడీవో స్వప్నకు రాజీనామా పత్రాలు అందిస్తున్న పాయకరావుపేట వలంటీర్లు



రాజీనామా పత్రాలతో ఉద్దండపురం వలంటీర్లు

పాయకరావుపేట : స్థానిక 5 వ నంబర్ సచివాలయానికి చెందిన 11 మంది గ్రామ వలంటీర్లు శనివారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.స్వప్నకు రాజీనామా పత్రాలు అందించారు. ఎన్నికల సంఘం ఆంక్షల కారణంగా తాము రాజీనామాలు చేసినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ విజయానికి తామంతా కృషి చేస్తామన్నారు.

ఉద్దండపురంలో..

నక్కపల్లి : మండలంలోని ఉద్దండపురంలో గ్రామ వలంటీర్లంతా శనివారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఎంపీడీవో శ్రీనివాసరావుకు తమ రాజీనామా పత్రాలు అందజేశారు. చంద్రబాబునాయుడు తమపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు, కుట్రలకు మనస్తాపం చెంది తామంతా రాజీనామా చేస్తున్నట్లు వారంతా ప్రకటించారు. తామంతా జగనన్నకు మద్దతు ఇస్తామని, స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. సర్పంచ్ పొడగట్ల వెంకటేష్, ఎంపీటీసీ సభ్యుడు బచ్చలరాజు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలి రావాలని పిలుపు

ఎస్.రాయవరం : పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులు సోమవారం నామినేషన్ వేయనున్నారని, ఆ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలి రావాలని పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు అన్నారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద శనివారం పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ప్రతి గ్రామం నుంచి వైఎస్సార్‌సీపీ అభిమానులు నామినేషన్ ఘట్టానికి పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. అడ్డురోడ్డులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రను విజయవంతం చేసినందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలను అభినందించారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయన్నారు. సీఎం జగన్ చేసిన అభివృద్ధిని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్ కర్రి సత్యనారాయణ, పార్టీ నాయకులు వెలగా శ్రీనివాసరావు, గుర్రం నానాజీ, గంగబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



స్థానిక నాయకులతో మాట్లాడుతున్న బొలిశెట్టి గోవిందు

సీఎం జగన్‌తోనే మరింత సంక్షేమం

జోరుగా వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం



గుడివాడలో ప్రచారం చేస్తున్న శ్రీపతిరాజు తదితరులు

ఎస్.రాయవరం : మండలంలో వైఎస్సార్‌సీపీ ప్రచారం హోరెత్తుతోంది. గుడివాడ గ్రామంలో పార్టీ నాయకులు పేరిచర్ల శ్రీపతిరాజు ఆధ్వర్యంలో సర్పంచ్ దూళి శ్రీనుబాబు, మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు గెలుపునకు కృషి చేసి మరో మారు జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాలని చెప్పారు. పేదోడి కళ్లలో ఆనందం జగనన్న ప్రభుత్వంలోనే చూస్తున్నామని, ఆయనను గెలిపించుకుంటే మరింత సంక్షేమం చేరువవుతుందన్నారు. రాములరాజు, జోగిబాబు, అచ్యుత రామరాజు తదితరులు పాల్గొన్నారు.